# పతివ్రతా మహిమ

ప్రపంచంలో అనేకమంది గొప్పవాళ్ళున్నారు - ఒక్కొక్క విషయంలో అందరికన్నా ఎక్కువగా చెప్పుకోదగిన వాళ్ళు. వాళ్ళందరూ రోజుకు ఏ రెండు మూడు గంటలన్నా తమ ఘనతను, తమ ప్రత్యేకత్వాన్ని మరిచిపోయి సామాన్య మనుష్యులల్లే ప్రవర్తించగలరు. పెరీ[1]ని తీసుకోండి. అతను ఏ సినిమా అయినా చూడబోయి మంచిచిత్రం చూస్తున్నప్పుడు తను పెద్ద టెన్నిసు తారనేమాట తప్ప కుండా మరిచిపోతాడనుకోవచ్చును. బాల్‌గేమ్ చూస్తున్న చార్లీ చాప్లిన్‌కూడా ఆ విధం గానే తన చెప్పులూ, కర్రా, టోపీ, మీసాలు వగైరాలను మరిచిపోతాడనుకోవచ్చును. చివరకు ఎడ్వర్డు సార్వభౌముడు [2] కూడా తాను చక్రవర్తి అనేమాట తాత్కాలి కంగా మరిచిపోయి బాహ్యప్రపంచంలో కలిసిపోవచ్చును. ఇంకా చివరకు నాబోటి రచయితలు కూడా ఏ విషయంలోనో మునిగిపోయి తమ రచయితత్వాన్ని మరువ వచ్చును. (ఇది కొంతవరకు ఊహించుకోటానికి అసంభవమైన విషయమే అను కోండి! అయినా-) కాని మా శివానందం మాత్రం, ఏ పని అయినా చేస్తూండనివ్వండి ఎక్కడనైనా ఉండనివ్వండి తను సంఘ సంస్కర్త అనే విషయం చచ్చినా మరవడు.

మీదు మిక్కిలి వీడి సంఘసంస్కర్తృత్వం పర్వదినాల్లో పక్కనున్న వాళ్ళ ప్రాణాలమీదికి వస్తూఉంటుంది.

గడిచిన మంగళవారంనాడు (ఆనాడు అమావాస్య కాదూ?) మా వాడు క్లబ్బులో రేగిపోయినాడంటే నమ్మండి.

"సంఘసంస్కరణ! సంఘసంస్కరణ!' అని అరవగానే సరా? ఏమిత్రా, మన వాళ్ళేడుస్తున్న సంఘసంస్కరణా" అని మావాడు అరిచాడు. పత్రికలు చూస్తున్న పెద్దలు కళ్ళజోళ్ళమీదిగా మా వంక చూసి, ఒకరివంక ఒకరు చూసుకుని, "కానీ!

---

1. పెరీ : ఫ్రెడరిక్ పెరీ (1909-) బ్రిటన్ దేశీయుడు. లాన్, టేబుల్ టెన్నిస్ క్రీడా కారుడు. 1929 బుడాపెస్ట్‌లో జరిగిన ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీల్లో సింగిల్స్‌లో ప్రథమ స్థానాన్ని పొందాడు. ఆ తర్వాత ఆధునిక బ్రిటిష్ లాన్ టెన్నిస్ క్రీడా కారుల్లో మేటి అయ్యాడు. 1933లో డేవిస్ కప్ పెరీ టీమ్ గెలుచుకుంది. ప్రత్యర్థులందరూ భయపడేంత గొప్ప ఆటగాడు. ఆత్మవిశ్వాసం, దృఢత్వం, బలంగా బంతిని గొట్టే శక్తి వున్న ఆటకాడు.

2. ఎడ్వర్డు సార్వభౌముడు : (1894-1972) ? బ్రిటన్, ఐర్లండ్ చక్రవర్తి అయిన ఎనిమిదవ ఎడ్వర్డు సార్వభౌముడు కావచ్చు.

కానీ!" అన్నట్టు తలలు ఊగించి, మొహాలకు పత్రికలు అడ్డం పెట్టుకుని మేమెవరమూ అక్కడ లేనట్టు నటించసాగారు.

"ముందూ వెనకా, చాలూ మూలా తెలియకుండా, 'ఆడదాన్నీ, మగవాణ్ణీ ఒకటి చెయ్యండీ! ఆడవాళ్ళకు కూడా మగవాళ్ళ చదువు చెప్పించండీ! విధవా వివాహాలు చెయ్యండీ! రజస్వలానంతర వివాహాలు చెయ్యండీ!" అని పేలగానే సరా? ఏమిటి వ్యవహారం? మనం ఏ స్తితిలో ఉన్నాం? మన సాంప్రదాయాలేమిటీ? మన కధేమిటీ? కమామీషేమిటి ?' అని కాస్త విచారించవద్దూ?"

మా శివానందం ధోరణి చూసి శర్మ కుర్చీలోనించి లేచి మా వాడి చెయ్యి తీసుకొని నాడి పరీక్ష చెయ్యటం మొదలు పెట్టాడు. మా వాడు చెయ్యి లాక్కుని వాణ్ణి రెండు తిట్టాడు. వాడు మళ్ళీ మూడు తిట్టాడు. ప్రకాశం ఇద్దరినీ విడదీసి తనే స్వయంగా మా వాడితో పోట్లాట పెట్టుకున్నాడు.

"ఇంతకూ నువ్వేమిటోయ్ చెప్పదలిచిందీ? తేల్చవేం? తేల్చూ!" అన్నాడు ప్రకాశం.

"చూస్తున్నకొద్దీ నాకు ఈ సంఘసంస్కరణ పెడతోవను పోతున్నట్టు కనిపిస్తున్నది."

"అట్లా సంగ్రహంగా ఏడవరాదూ?" అన్నాడు ప్రకాశం.

"నన్ను శర్మ సాంతంగా ఏడవనిస్తేగా?" అన్నాడు మావాడు.

"వాడిది అదో ఏడుపూ!.... అయితే నువ్వు నేను కిందటిసారి చూసినప్పుడు కూడా బాగానే ఉంటివే?" అన్నాడు ప్రకాశం.

"నేను కూడా ఆ మాటలన్నీ అన్న సంస్కర్తనే కదా అనేనా నీ అభిప్రాయం? ఆ! నేనూ ఆ గడ్డి కరిచినవాణ్ణే మరి. అయితే ఏం? నీ దయవల్ల భగవంతుడు నాకు బుర్ర అనేది ఒకటి పెట్టాడు. కనక సత్యం ఎప్పటికైనా కనిపెట్టగలిగాను."

"ఏమిటి నువ్వు కనిపెట్టింది?"

"మన సంఘం బాగుపడాలంటే-"

"అనకపోతే?" అని శర్మ అడ్డం వచ్చాడు కాని మా వాడు వాణ్ణి గమనించదలచలేదు.

"మన సంఘం బాగుపడాలంటే, మన స్త్రీలకు అనాదిగా వస్తున్న పాతివ్రత్యం అవలంబించటం కంటే వేరు మార్గం లేదు. మనవాళ్లు సింబాలికల్‌గా పతివ్రతలు అనేక అమానుష కార్యాలు తమ పాతివ్రత్య మహిమచేత సాధించినట్టు చెప్పారు. అదంతా మనం అక్షరాలా అంగీకరించకపోయినా, ఈనాడు కూడా పతివ్రతా ధర్మం అవలంబించి రాక్షసులవంటి భర్తలను సహితం తిప్పుకొని వచ్చిన ఇల్లాళ్ళను మనం కళ్ళారా చూస్తున్నాం. ఈనాడుకూడా దాన్ని మించిన శక్తిలేదు."

"ఓ, అదా?" అన్నాడు శర్మ. "అట్లా మొదటనే చెప్పరాదూ ? నిజమేనా, బ్రదర్ ! ఒక్కక్షణం నీకు జబ్బుగా ఉన్నదన్నంత అనుమానం కూడా స్ఫురించి

నందుకు నేను మరీమరీ పశ్చాత్తాప పడుతున్నాను. అటువంటి పతివ్రతలను నేను స్వయంగా ఎరుగుదును."

"ఒకటి రెండు కథలు చెప్పరా, శర్మా," అని నేనూ ప్రకాశమూ శర్మను వేడుకున్నాం.

"వినండి!" అన్నాడు శర్మ. వాడు చెప్పిన కథ ఇదీ.

సుదర్శనం అని మా శర్మ స్నేహితుడొకడున్నాడు. వాడొక పిల్లను ఏరికోరి చేసుకున్నాడు. భార్య కాపరానికి వచ్చిన తరవాత ఏం జరిగిందంటే ఆ సుదర్శనానికి భార్య ప్రవర్తన ఏమీ నచ్చలేదు. పిల్ల అయితే చాలా అందగత్తే కాని, ఆ విషయం అందరికన్నా ఆ పిల్లకే బాగా తెలియటమే కాకుండా, ఆ పిల్ల తన అంద చందాలు యావత్తూ ఒక్క మొగుడిపాలు చేసి ఊరుకోవటం ఆమే నచ్చలేదు. సౌందర్యం అనుభవించటానికి ప్రపంచంమీద ప్రతివ్యక్తికీ హక్కున్నదని ఆ పిల్లే మొగుడితో వాదించేది. తన చక్కదనం చూసి అంతా ఆనందించ గలందులకు తరుచూ వీధివాకిట్లో నిలబడటం, నలుగురు అమ్మలక్కలతో ఏ గుడికో, తిరణాలకో పోయినప్పుడు తనే అందరికీ ముందుండి మగవాళ్ళ మధ్యగా దారితియ్యటం, మొదలైన పనులు చేస్తుండేది. పక్కింటివారి పిల్ల, అయిదేళ్ళదానితో ఈ సుదర్శనం భార్య ఒకసారి అన్నదిట ముద్దు పెట్టుకోవడం అందరికీ చాతకాదనీ, తన మేనత్త కొడుకెవరో చాలాచక్కగా ముద్దు పెట్టుకుంటాడనీ! అదంతా ఆ పిల్ల పూసగుచ్చినట్టు సుదర్శనం తల్లికి చెప్పి చేతులు దులుపుకుని తనదారిన వెళ్ళింది. తల్లి వచ్చి సుదర్శనాన్ని నానామాటలూ అని వంటఇంట్లోకి వెళ్ళి పప్పుగిన్నె కింద పడేసి పప్పంతా నేలపాలు చేసింది. సుదర్శనం సిగిరెట్టు కాల్చుకోబోయి చెయ్యి కాల్చుకుని ఆ తరవాత సిగిరెట్టుకూడా కాల్చుకుని భార్యను నిలవదీసి అడిగాడు.

తన మేనత్తకొడుకు విషయం తమ అవతలిఇంటి పిల్లతో అన్న ముక్క నిజమేనని సుదర్శనంభార్య అన్నది కాని అదీ చిన్నపిల్లలను ముద్దు పెట్టుగోటం విషయమై అన్నానన్నది. సుదర్శనం వెధవమొహంవేసి "నేను నమ్మను!" అన్నాడు. తన గుండె పరీక్ష చేసుకోమన్నది. సుదర్శనం పరీక్షచేసి తృప్తిపడ్డాడు.

మర్నాడు పొరుగింటి ఆవిడ సుదర్శనం తల్లిదగ్గిరికి వచ్చింది, తన పిల్ల బుగ్గలు వారి కోడలు నిష్కారణంగా నులిమిందిట ఏమిటని అడగడానికి!....

అనుమానమనేది పడకుండానే ఉండాలిగాని పడ్డ పరవాత అది దృఢపడేటందుకు ఎంత ఆధారమైనా చిక్కుతుంది. తన భార్య అనాఘ్రాతం పుష్పం కాదనీ, తన అత్తగారు కూడా ఉత్తమజాతి పతివ్రతల్లో ఒకతె కాదని అతనికి నమ్మకంగా తెలిపోయింది.

అయితే కష్టసమయంలో భగవంతుడు జ్ఞాపకానికి వచ్చినట్టు, ఈ పరిస్థితుల్లో సుదర్శనం భార్యా విషయమై విశాల హృదయుడు కావాలని ప్రయత్నించాడు. అసలు అవినీతి అనేది ఏమిటి? ఈ నీతి ఎందుకు కల్పించబడ్డది? తనభార్య చంచలబుద్ధి కల

దైతే తనకు వచ్చిన కష్టం ఏమిటి ? ఇప్పుడిప్పుడు ఇటువంటి వాటిల్లో మడి గట్టుకుని కూర్చోవటం ఆచే ఫాషను కూడా కాదు ! అదీకాక తన భార్యవల్ల తను ఎంతో సుఖపడుతున్నాడు. ఎందుకు వెళ్ళగొట్టడం ? అందరికీ శరీరం అమ్ముకునే భోగం వాళ్ళ దగ్గిరికి పొయ్యేవాళ్ళకన్న తన భార్యతో తాను కాపరం చెయ్యటం ఎంత నయం ! అల్లరిపనులూ చిల్లరపనులూ చెయ్యకుండా తన భార్యను తాను కాపాడు కుంటే సరీ !

అయితే సుదర్శనం ఒక పని చేశాడు. తన దృష్టిలోనే తాను వాజమ్మ అల్లే కనబడకుండా ఉండగలందులకు తాను కూడా ఇతరత్రా ఒక మనిషిని సంపాదించాడు.

"ఈ మనిషే నేను చెప్పబొయ్యే పతివ్రత. ఈ మనిషి మా స్నేహితుడి భార్య కంటె అందచందాల్లో తక్కువైన మనిషేకాని గుణంలో మహా గొప్పది !" అన్నాడు శర్మ.

"ఇదేం కథ ?" అన్నాడు మావాడు.

"విను ! మొదట మొదట నా స్నేహితుడు భార్య అందానికి మోహితుడై ఈ మనిషిని సరిగా చూసేవాడు కాడు. కాని ఈ మనిషి తన పతివ్రతా ప్రభావంచేత మెల్లిగా వాడి మనస్సు ఆకర్షించి చివరకు వాణ్ణి తన దాసుణ్ణి చేసుకుంది. భార్య మొహం చూడకుండా అటు భ్రమ పుట్టకుండా చేసేసింది !" అని శర్మ కథ పూర్తి చేసేశాడు.

"హియర్ ! హియర్ !" అని ప్రకాశం చప్పట్లు కొట్టాడు. క్లబ్బు సెక్రటరీ వచ్చి వాణ్ణి మందలించాడు. కొత్త ఎన్నికలు ఇంకా వారంరోజుల్లో రాబోతున్నవని ప్రకాశం ఆయనకు జ్ఞాపకంచేసి అవతలికి పంపించాడు.

"ఈ లేవిటీ-ఈ లేకితనమే మన ఆంధ్రులను ఈ స్థితికి తెచ్చింది !" అన్నాడు మావాడు మండిపడి.

"ఏ లేకితనం" అన్నాడు శర్మ.

"ఏ స్థితికి ?" అన్నాడు ప్రకాశం.

"పుస్తెకట్టిన మనిషికే గాని పతివ్రతాధర్మం వర్తించదా ఏమిటి ?" అన్నాడు శర్మ.

"ఇప్పటి ఆంధ్రుల స్థితికి ఏం వంక పెడుతున్నావు ?" అన్నాడు ప్రకాశం ఆంధ్రత్వం ఉట్టిపడుతూ.

"మీతో అందుకనే ఏమీ చర్చించను అప్పటికీ. మీ బుద్ధులు నేనెరుగుదును !" అన్నాడు మావాడు.

శర్మ మావాణ్ణి మాటలు సరిగా రానిమ్మన్నాడు. మళ్ళీ ప్రకాశం సంధి చేశాడు.

"శర్మ చెప్పిన కథ చాలా లెవిట్‌గానే ఉందిరా, భాయ్ ! నేనొకటి చెబుతాను చూడు !"

"మావూళ్ళో ఒకాయన ఉన్నాడు. ఆయన భార్య ఆదర్శ స్త్రీ అనుకోవచ్చు. మొగుడు ఆవిణ్ణి ఏలేవాడుకాడు. ఇంకొక పెళ్ళి చేసుకుని ఆయన మొదటి పెళ్లాంతో మాట్లాడేవాడు కాడు, ఆవిడచేతి అన్నం కూడా తినేవాడుకాడు. అయితే ఆవిడ మాత్రం ఒంటిపూట భోజనంచేసి పాతచీరలు కట్టుకుంటూ, మొహాన రూపాయంత కుంకంబొట్టు పెట్టుకుని పార్వతీదేవల్లే ఉండేది!" అని ప్రకాశం మాట్లాడటం చాలించాడు.

వాడికి కథ చెప్పటం చాతకాదులెండి. అందుకని నేను "ఆ తరవాత ఏమయింది? అంతేనా కథ?" అని అందించాను.

"ఇంకేముందీ?" అన్నాడు ప్రకాశం ఆశ్చర్యంతో.

"ఆవిడ ఏం చేసింది?"

"అదా?" అన్నాడు ప్రకాశం తనలో సంగ్రహించుకొని, "ఆవిడ వాళ్ళ బట్టలుఉతికే చాకలివాడితో లేచిపోయింది!" అన్నాడు.

శర్మ బిగ్గిరిగా నవ్వటం మొదలుపెట్టాడు. నాకూ నవ్వు వచ్చింది. మావాడు మాత్రం మొహం ఎర్రబడి చాలా ప్రమాదకరమైన స్థితిలోకి వచ్చాడు.

"ఇదా నువ్వు చెప్పే కథ?" అన్నాడు మావాడు మళ్ళీ ఎట్లాగో మన ప్రపంచంలోకి వచ్చి.

"అది కాదురా, సెర్చ్‌లైట్! ఆవిడ ఉన్నంతకాలమూ ఎంత పతివ్రతగా ఉందనుకున్నావు? ఎవరివంకా కన్నెత్తి చూసేదికాదు!" అని మా ప్రకాశం సమర్థించుకున్నాడు.

"సంతోషించారులే! ఇక చాలించు!" అన్నాడు మావాడు.

"పోనీ మా కథలు బాగుండకపోతే నువ్వొక కథ చెప్పరాదూ?" అన్నాడు ప్రకాశం ఛాలెంజిగా.

మావాడు కాస్త ఆలోచించి తనకథ చెప్పితేనేగాని మా నోళ్ళు కట్టుబడవని తీర్మానించుకున్నాడు.

"నే నెరిగినంతట్లో రామశాస్త్రికన్న జారుడూ తాగుబోతూ ఉండబోడు. అంత భార్యా విముఖుణ్ణి కూడా నే నెక్కడా చూడలేదు. ఎవరైనా భార్యలను అనాదరంతో చూస్తారు, వేపుకుతింటారు, కొడతారు, తిడతారు. శాస్త్రి ప్రవర్తన మాత్రం ఇక ఎవడికీరాదు. వాడి భార్యకాక మరొకతె అయితే వాడి ఒత్తిడికి ఎప్పుడో ఆత్మహత్య చేసుకుని ఉండును. ఆమెది ఎంత ఓర్పు! ఏమి శాంతం! ఏమి అణకువ!"

"ఉండు! ఉండు!" అని నేనే మావాడికి అడ్డం వచ్చాను. "ఈ కథ నన్ను చెప్పనీ. నాకన్న శాస్త్రిని నువ్వు బాగా ఎరగవు."

"వాడు రెండు మూడేళ్ళ క్రితం నా దగ్గిరికి వచ్చి 'ఒరే, ఆడదాన్ని వదిలించుకోవాలంటే ఏం చెయ్యాలి?' అని అడిగాడు.

"'ఎవరిని నెత్తిన తెచ్చిపెట్టుకున్నావు?' అని అడిగాను.

"వాడు తన ఘోష చెప్పుకొచ్చాడు. వాడికి ఎందుకో భార్యమీద విరక్తి పుట్టింది. ఏమిటని అడిగితే ఆ భార్యతో కాపరం చెయ్యటంకంటె రోత లేదన్నాడు, మీద చెయ్యివేస్తేనే వళ్లు గరిపొడుస్తుందన్నాడు. ఇంకా కొంత చెప్పాడనుకోండి. నేను మిగిలింది ఊహించుకున్నాను.

"తన భార్యను ఎవరికైనా అమ్మటం విషయం నా సలహా అడిగాడు. నాకు 'లా' తెలియదు కాని కోర్టులో పెడతారేమో నన్నాను. కొడితే ఎట్లా ఉంటుందన్నాడు. చూడమన్నాను. లాభం లేకపోయింది.

"పోనీ ఇట్లాగే ఉండరాదా అని వాడితో అన్నాను. కాదన్నాడు. భార్య లేచిపొయ్యేటట్లు చేసేందుకు ఎంతనైనా పాల్పడతానన్నాడు. నా సలహామీద వాడు భార్యను వాళ్ళతోనూ వీళ్ళతోనూ లేచిపొమ్మని అని చూశాడు. లాభం లేకపోయింది. అన్ని దురలవాట్లూ చేసి చూశాడు. వాడి భార్య చలించలేదు. ఇంటికి రకరకాల ముండలను తెచ్చాడు. అదీ సహించింది. పైగా వీడు ఒక్కొక్క కొత్తవేషం వేస్తున్న కొద్దీ ఆవిడ వాడిమీద ఇంకా ఆపేక్షగా ఉండటం మొదలుపెట్టింది. ఈ లోపల ఆవిడకు మహాపతివ్రత అనే ఖ్యాతి ఒకటి బాగా వచ్చింది.

"ఇంతకూ శాస్త్రి ఓడిపోయినాడు–చిత్తుగా ఓడిపోయినాడు. ఇక ఆ అలవాట్లన్నీ ఎందుకూ? అన్నీ మానేశాడు. నేను మొదట ఇచ్చిన సలహానే అవలంబించటం మొదలుపెట్టాడు. నాకు మాత్రం లోపల అనుమానమే ఎప్పుడు పెళ్ళాన్ని ఖూనీ చేస్తాడో అని.

"అంత మొండిమనిషిని నే నెక్కడా చూడలేదు. అది పాతివ్రత్యం అయితే నన్ను వెయ్యిజన్మాలకైనా భగవంతుడు పతివ్రతగా చెయ్యకుండా ఉండుగాక!

"సంగతేమిటంటే, ఆడదానికి, మగవాడిలో లేని బింక ఒకటి ఉంది. అందు చేత అతుక్కునే స్వభావం ఆడదానికి జాస్తి. పైగా తనను తను కాపాడుకుని పోషించుకునే సత్తాలేని పరభృతం కావటంచేత ఆడదానికి ఈ అంటుకునే ఇన్స్టింక్టు లేకపోతే చచ్చిపోతుంది. దాన్ని సంస్కరించాలంటే స్త్రీలకు విద్యా, ఆత్మాభిమానమూ, తమ మీద తాము ఆధారపడగల ధైర్యమూ అవీ కల్పించాలి. వేరేమార్గం లేదు. ఇప్పుడు సంస్కరించబడవలసింది ఈ పాతివ్రత్యమే!" అని నేను నా కథ పూర్తి చేశాను.

ముద్రణ :
వినోదిని